# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


## ప్రశాంత వాతావరణంలో గ్రూప్ 4 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించిన ఎస్పీ



అభ్యర్థి హాల్ టికెట్‌ను సరిచూస్తున్న ఎస్పీ నరసింహ

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 01 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రూప్ 4 పరీక్ష కేంద్రాలను మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ పర్యవేక్షించారు. పరీక్ష ప్రారంభానికి ముందే బాలుర జూనియర్ కళాశాల సెంటర్‌ను తనిఖీ చేశారు.విద్యార్థుల హాల్‌టికెట్ల నంబర్‌లు, గుర్తింపు కార్డులను పరిశీలించారు. సెంటర్ వద్ద మన ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షల కేంద్రాల వద్ద 144సెక్షన్ అవర్‌లో ఉంటుందని ప్రజలు సహకరించాలన్నారు. మొత్తం జిల్లాలోని 111 కేంద్రాల్లో పరీక్ష ముగిసే వరకు నిరంతరంగా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగానే సూచించిన మేరకు గేట్లు మూసివేయడంతో కొంతమందిని అనుమతించలేదని చెప్పారు. సెంటర్ల వద్ద పటిష్టమైన మూడు అంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన పోలీస్ సిబ్బంది, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహ

## ఈవీఎంలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి..

**- నాగర్‌కర్నూల్‌జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జూలై 01 ప్రభాతవార్త:** ప్రతి ఈవీఎంను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వాటిల్లో ఏ దశలోను ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రానున్న ఎన్నికల కోసం నిర్వహిస్తున్న ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీని, ఈవీఎంలను భద్రపర్చే తీరును ఈవీఎం గోడౌన్‌లో శనివారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీని చేపట్టారు. ఈవీఎంల గోడౌన్‌లోకి వెళ్లి ఈవీఎం బ్యాలెట్ యూనిట్,కంట్రోలింగ్ యూనిట్, వీవీ పాట్ యంత్రాలను మొదటి దశలో పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచే గదిని, సమస్యలు తలెత్తిన ఈవీఎంలను వేరుగా భద్రపరిచే విధానాన్ని, భద్రత సిబ్బంది నిబంధనలకు బ్యారికేడింగ్ విధానాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల విభాగం డీటీ రాఘవేందర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## గ్రూప్ 4 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా శనివారం ఉదయం జరిగిన గ్రూప్ 4 మొదటి సెషన్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని నవోదయ, జ్ఞానప్రభ కళాశాల, ప్రియదర్శిని డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి, పరీక్షా నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. అభ్యర్థుల హాజరుశాతం గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నా పత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు.పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం రెండవ సెషన్‌లో జరిగే పేపర్ 2 పరీక్షను ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించడం జరగాలని, టిఎస్‌పీఎస్సీ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు కలెక్టర్ సూచించారు. గ్రూప్ 4 పేపర్ 1 పరీక్ష జిల్లాలో ప్రశంతంగా జరిగిందని కలెక్టర్ తెలిపారు. మొదటి సెషన్లో 14,920 మంది అభ్యర్థులలో 12,580 మంది హాజరు కాగా 2340 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. దీంతో 84.32 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు.





పరీక్షా సెంటర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

# పోడు భూములకు పట్టం..!



పోడు భూములు సాగుచేస్తున్న రైతులు

**జల్ జంగల్ జమీన్ అని నినదించిన గోండు బిడ్డ కొమురం భీం స్ఫూర్తిగా తెలంగాణ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకున్నది. గిరిజనులకు శుభవార్త చెబుతూ పోడు భూములకు జూన్ 30 నుంచి పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2389 దరఖాస్తులు రాగా, 5532 ఎకరాల భూమి పంపిణీ చేయనున్నారు. కాగా నాగర్‌కర్నూల్ జిల్లాలో పోడు రైతులు అధికంగా ఉండడం గమనార్హం. ఈ వానకాలం నుంచే రైతుబంధు సైతం వర్తింపజేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో పోడు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

***- మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 1, ప్రభాతవార్త***

- అటవీ భూములపై గిరిజనులకు హక్కు
- ఏండ్ల నాటి సమస్యకు సర్కార్ పరిష్కారం
- పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం
- చారిత్రాత్మక నిర్ణయంతో అడవిబిడ్డల సంబురం
- ఈ వానకాలం నుంచే రైతుబంధు సైతం అమలు..
- ఉమ్మడి జిల్లాలో 5500 ఎకరాలకు పైగా పంపిణీకి సిద్ధం..

జిల్లాల వారీగా భూ విస్తీర్ణం వివరాలు..

| జిల్లా | ఫిర్యాదులు, | ఫిర్యాదులు విస్తీర్ణం(ఎకరాల్లో) |
|---|---|---|
| నాగర్‌కర్నూల్ | 1978 | 5056 |
| మహబూబ్‌నగర్ | 19 | 13 |
| నారాయణపేట | 03 | 08 |
| వనపర్తి | 389 | 455 |

గతేడాది నవంబర్, డిసెంబర్‌లో పోడు భూములకు సంబంధించి రైతుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం గిరిజనేతరులు అటవీ భూముల్లో కనీసం మూడు తరాలు సాగు చేసి ఉండాలి. అంటే కనీసం 75 ఏండ్ల పాటు సాగు చేస్తున్నవారు పోడు పట్టాలకు అందుకునేందుకు అర్హులుగా సర్కార్ తేల్చింది. అయితే గిరిజనులకు మాత్రం 2005 సంవత్సరం ముందు నుంచి సాగులో ఉంటే అర్హులుగా నిర్ణయించింది. ఈక్రమంలో పోడు భూముల దరఖాస్తులు అంచనాకు మించి రావడంతో గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వే నిర్వహించింది. దరఖాస్తులకు క్షుణ్ణంగా పరిశీలించి డూప్లికేట్, మైనర్లను అనర్హులుగా గుర్తించింది.

**నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికం..**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధికంగా పోడు వ్యవసాయం చేసే గిరిజనులు, గిరినేతరులు నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఉన్నారు. తర్వాత స్థానంలో వనపర్తి జిల్లా ఉన్నది. అయితే నాగర్‌కర్నూల్‌లో అధికారుల అంచనా మేరకు 2400 వరకు చెంచులు, గిరిజనుల స్వాధీనంలో సుమారు 7500ఎకరాల వరకు భూమి ఉందని భావించారు. అయితే డిసెంబర్ వరకు వచ్చిన దరఖాస్తులను చూసి అధికారులు నివ్వెరపోయారు. సుమారు 12వేల రైతుల నుంచి 35వేల ఎకరాల వరకు దరఖాస్తులు రావడం గమనార్హం.

**ఆక్రమణకు అవకాశం లేకుండా..**

దేశ చరిత్రలోనే మొదటిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఎకరాల పంపిణీకి సర్కార్ రంగం సిద్ధం చేసింది. ఈక్రమంలో వివిధ జిల్లాల నుంచి పోడు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని అవకాశం కల్పించింది. ఒకసారి భూపంపిణీ చేశాకా ఒక ఇంచు భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. పాలిగన్ టెక్నాలజీతో పోడు భూముల పట్టాలను రూపొందించారు. భూమి సర్వే నెంబర్, ఏ అక్షాంశ, రేఖాంశాల మధ్య ఉన్నది, సంబంధిత భూ హద్దులు ఏవేవి ఉన్నాయి, వంటి అంశాలను గూగుల్ మ్యాప్ ఆధారంగా హోలోగ్రామ్‌ను హక్కుపత్రంలో పొందుపర్చారు. దీనివల్ల భూపంపిణీ అనంతరం కూడా ఇరుగు పొరుగు వారితో హద్దు వివాదాలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. లబ్ధిదారుడు భూమి పక్కనే అటవీ భూమి ఉన్నా కూడా భవిష్యత్తులో ఆక్రమించుకోవడానికి అవకాశం లేకుండా కొత్త టెక్నాలజీని ఉపయోగించారు.

**పకడ్బందీగా హక్కులు..**

అటవీ భూయాజమాన్య హక్కు పత్రాలను సర్కార్ అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా తయారు చేస్తున్నది. మూడు శాఖ అధికారులు, లబ్ధిదారిడి సంతకాలను అందులో పొందపర్చుతారు. పత్రాలపై అటవీ, గిరిజన, రెవెన్యూ అధికారుల సంతకాలు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. వానకాలం నుంచే రైతుబంధు అందేలా తీపి కబురు అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# టీ డయాగ్నోస్టిక్‌లో మరిన్ని సేవలు..!

**మరో 77 పరీక్షలు ఉచితం**

**మొత్తం 134 పరీక్షలు అందుబాటులోకి**

**జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి వెల్లడి**



అదనపు పరీక్షలను ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్,వైద్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 01 ప్రభాతవార్త :** ప్రస్తుతం మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలోని టీటాగ్నోస్టిక్‌లో నిర్వహిస్తున్న 54 రక్త పరీక్షలకు అదనంగా ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ ఆదేశానుసారం మరో 77 రకాల పరీక్షలను ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు మహబూబ్‌నగర్ జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి వెల్లడించారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ దయాగ్నోస్టిక్ హబ్ (టీహబ్)లో వైద్యులతో కలిసి నూతన పరీక్షలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా అక్రిడిటేషన్ గుర్తింపు పొందిన ఘనత మన దయాగ్నోస్టిక్‌కే దక్కిందన్నారు. మహబూబ్‌నగర్‌లో వెయ్యి పడకల అధునాతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే అన్ని రకాల వైద్య సదుపాయాలు స్థానికంగానే లభిస్తాయన్నారు. గతంలో ధనవంతులకు మాత్రమే సాధ్యమయ్యే అనేక ఖరీదైన వైద్య పరీక్షలు ఇప్పుడు టీ హబ్‌లో ఫుల్లీ ఆటోమెటిక్ ఎక్విప్‌మెంట్ ద్వారా సుమారు 134పైగా వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిప్యూటి సూపరింటెండెంట్ డా. జీవన్, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, ఆర్ఎంఒలు డా. లక్ష్మణ్, డా.ప్రసన్న, టిహబ్ నోడల్ ఆఫీసర్ డా.సృజన, ప్రోగ్రాం ఆఫీసర్ డా. రఫిక్, అరుణ, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న

## ప్రశాంతంగా టీఎస్‌పీఎస్సీ గ్రూప్4 పరీక్ష..



పరీక్ష కేంద్రం వద్ద కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త :** జిల్లాలో శనివారం జరిగిన టీఎస్సీపీఎస్సీ గ్రూప్ 4 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కేందంలోని పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించి అభ్యర్థులు పరీక్షను రాస్తున్న విధానాన్ని పరిశీలించారు.చీఫ్ సూపరింటెండెంట్ గదులను పరిశీలించారు. ప్రశ్నా పత్రాలను సిసి కెమెరాల ఎదుట తెరవాలని, మెటీరియల్ తెరిచే విధానాన్ని పూర్తిగా రికార్డు చేసి పంపించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన స్క్రైబ్‌లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 4 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన జిల్లాలో 28పరీక్షా కేంద్రాలలో మొత్తం 7325 మంది విద్యార్థులకు పేపర్ 1.6356 మంది హాజరయ్యారని 969 మందిని అపాయింట్ అయినట్లు దీంతో 86.77 శాతం హాజరైనట్లు తెలిపారు.

## కురవని వర్షాలు..

## ఆందోళనలో అన్నదాతలు..!

**- నల్లనిమేఘాలు..చల్లనిగాలులతోనే గడుస్తున్నకాలం**

**- చినుకులతోనే సరిపెడుతున్న వరణుడు**

**- మొఖం చాటేసిన వర్షాలు..**



దేవరకద్ర మండలం నాగారం సమీపంలో వేసిన పత్తి పంట

**దేవరకద్ర,జులై 01 ప్రభాతవార్త:** పాలమూరు జిల్లాలో వరణుడు మొఖం చాటేశాడు..గత నెల 24న కురిసిన వర్షాలు మళ్ళీ కురవడంలేదు.. అసలు వర్షాల జాడ మళ్ళీ కనిపించడంలేదు. జిల్లాలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.వర్షాకాలం ప్రారంభమైన వరణుడు కరుణించడం లేదు.దీంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోయడం లేదు. వర్షాలు వస్తాయని కొంతమంది ఇదివరకే పొలాల్లో విత్తనాలను విత్తారు.కాని వర్షాల జాడ కనిపించకుండా పోయింది.దీంతో కొన్ని మండలాల్లో మొలకెత్తిన మొక్కలు వర్షం కోసం ఎదురుచూస్తున్నాయి.మరికొన్ని మండలాల్లో విత్తిన విత్తనాలు భూమిలోనే మొలకెత్తకుండా పోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు ఆయా మండలాల్లో పొలాల్లో విత్తనాలను విత్తారు.ఇక వర్షం కురవక పోవడంతో వాటి సంగతి అంతే.. దీంతో ఎక్కడ అదనుదాటిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఆకాశంలో నల్లని మేఘాలు..చల్లనిగాలులతోనే కాలం వెళ్ళిపోతుంది.కేవలం చినుకులతోనే వరణుడు సరిపెడుతు న్నాడు.రైతులపై కక్షగట్టాడు.జిల్లా రైతాం గంపై వరణుడు కరుణ చూపడం లేదు. పాలమూరు జిల్లాలో ఇంతవరకు ఎక్కడ కూడ ఒక్క పెద్దవర్షం కురిసిన దాఖలాలు లేవు.అన్నదాతలపై వరణుడు కరుణచూ పించడం లేదు.ఈ ఏడాది రుతుపవనాలు రాక ఆలస్యమైంది.రుతుపవనాలు ప్రవేశించిన వర్షాలు కురవడం లేదు.జూన్ మొద టివారంలో రుతుపవనాలు రావల్సింది. కెరళ రాష్ట్రానికి మే చివరివారం, జూన్ మొదటివారంలో రుతుపవనాలు వచ్చి వర్షాలు మొదలయ్యేవి.ఈ ఏడాది వారం, పది రోజుల పాటు రుతుపవనాల అల స్యంగా రావడంతో రాష్ట్రంలో రుతుపవ నాల జాడే కనిపించడ లేదు.కేవలం చల్లని గాలులు మాత్రం వీస్తున్నాయి.మే 25న రోహిణికార్తి ప్రారంభమైనప్పటి నుంచి అల్పపీడనం ప్రభావంతోనే రెండు రోజుల పాటు వర్షాలు కురిశాయి. జూన్7 తో రోహిణికార్తి ముగిసి మృగశిరకార్తి వచ్చింది.కార్తి వచ్చి చాలా రోజులుతున్న ఇప్పటివరకు వాన జాడ కనిపించడంలేదు. దీంతో రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. వర్షా లు వస్తాయని రైతులు సేద్యానికి తమ పొలా లను సిద్దం చేసి పెట్టుకొన్నారు.సేద్యం పరంగా అదృష్టపరిక్షకు సన్నద్దమయ్యారు.అయినా లాభం లేకుండా పోయింది.సేధ్యానికి వర్షం అడ్డంకిగా మారింది.



# ప్రజా ఆరోగ్యమే తెలంగాణ లక్ష్యం..!

**తెలంగాణ డయాగ్నోస్టిక్ రేడియాలజీ హబ్, ల్యాబ్ 134 రకాల పరీక్షలు అప్‌గ్రేడేషన్ హబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**గద్వాల ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రేడియాలజీ ల్యాబ్‌ను రూ 70 లక్షల వ్యయంతో నిర్మాణమైన రేడియాలజీ హబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే డా.అబ్రహాం హాజరయ్యారు. ఎమ్మెల్యేల చేతుల మీదుగా రేడియాలజీ ల్యాబ్‌ను 134 రకాల పరీక్షలు హబ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నూతన జనరేటర్‌ను ప్రజా ప్రతినిధులు ప్రారంభించడానికి ముందుగా వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, డా. అబ్రహాం, ప్రజా ప్రతినిధులు జిల్లా వైద్యాధికారి వైద్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ జాతీయ వైద్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి గద్వాలకు సిటీ స్కానింగ్ అవసరం, మెడికల్ కాలేజీ గురించి మంత్రితో ఎమ్మెల్యే మాట్లాడారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే సిటీ స్కానింగ్ ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా మెడికల్ కాలేజీకి సంబంధించిన జిఓను కూడా వారం 15 రోజుల్లో మంజూరు చేస్తామని తెలిపారు. గద్వాలలో కొనసాగుతున్న 300ల పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను, నర్సింగ్ కాలేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ వైద్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సీఎం కెసిఆర్ నేతృత్వంలో వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో వైద్య రంగానికి పెద్దపీట వేయడం జరిగింది. గతంలో ఈ ప్రాంతంలో సరైన వైద్య సదుపాయాలు లేక ఈ ప్రాంతం నుండి ప్రజలు కర్నూలు హైద్రాబాద్ వంటి ప్రాంతాలకు వైద్య సదుపాయాల కోసం ప్రజలు వెళ్లేవారు. ప్రధానమైన ఆరోగ్య సమస్యలు, రోడ్డు ప్రమాదాలు జరిగిన సరైన వైద్యం అందనప్పుడు కర్నూల్ వంటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు దారిలోనే ప్రాణాలను కోల్పోవడం జరిగిందన్నారు. జిల్లా ఆసుపత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ ద్వారా ఉచితంగా 57 రకాల పరీక్షలను నిర్వహించేవారు కాని వాటిని పెంచి నేటి నుంచి 134 రకాల పరీక్షలు చేసే విధంగా ఇప్పటి వరకు టి డయాగ్నోస్టిక్ 10 కోట్లకు పైగా ఉచిత టెస్టులను 57.68 లక్షల మంది రోగులకు ప్రయోజనం చేకూరిందన్నారు. నేడు రాష్ట్రంలో గద్వాల జిల్లాలలో నూతన రేడియాలజీ, పాథలజీ ల్యాబ్‌ను ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుంది. గద్వాలలో కూడానేడు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. గద్వాలకు త్వరలోనే సిటీ స్కానర్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరామని వారు కూడా సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా మెడికల్ కాలేజీ సంబంధించిన జిఓను కూడా ఇస్తామని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, జడ్పీ వైస్ ఛైర్మన్ సరోజమ్మ, ఎంపిపిలు విజయ్, ప్రతాప్‌గౌడ్,జడ్పీటిసి పద్మా వెంకటేశ్వర్‌రెడ్డి,రాజశేఖర్,ప్రభాకర్‌రెడ్డి,వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు, కౌన్సిలర్లు మురళి, శ్రీను, నరహరిగౌడ్, కృష్ణ, మహేష్, శ్రీమన్నారాయణ, గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, ఉపాధ్యక్షుడు ధర్మనాయుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, సత్యారెడ్డి, సీతారాములు, డిఎంహెచ్ఓ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కిశోర్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో క్ఫారెన్స్ ద్వారా మంత్రి హరీష్‌రావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు





తెలంగాణ డయాగ్నోస్టిక్ రేడియాలజీ హబ్, ల్యాబ్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

## రెండు తలల గోర్రెపిల్ల జననం..!

**-దేవరకద్రలో అరుదైన సంఘటన**



**దేవరకద్ర,జులై 01 ప్రభాతవార్త:** దేవరకద్ర లో శనివారం ఓ గొర్రెకు రెండు తలల గోర్రె పిల్ల(ఆడది) జన్మించింది.దేవరకద్రలో ఈ అ రుదైన సంఘటన జరిగింది.స్థానిక గొర్లకాపరి మల్లేశ్‌కు చెందిన గొర్రె ఈ విధంగా రెండు తలల గోర్రెపిల్ల జన్మించింది.పుట్టిన దాదాపు 12 గంటల తరువాత ఆ గొర్రెపిల్ల మృతి చెందింది.దీంతో ఆ గొర్రెపిల్లను చూడటానికి చాలామంది ఆసక్తి కనబరిచారు.జినటిక్ లేదా హార్మోన్‌ల ప్రభావం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని మండల పశువైద్యాధికారి జీషాన్‌అలి తెలిపారు.ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతాయన్నారు.కాని ఈ విధంగా జన్మించిన గొర్రెపిల్లలు బతుకవని పశువైద్యాధికారి తెలిపారు.

## హెల్త్ ప్రోగ్రామ్స్ ముందుకు నడిపించే కీలకపాత్ర సూపర్‌వైజర్లదే బాధ్యత

**డిప్యూటి డిఎంహెచ్ఓ డా.సిద్ధప్ప**



**గద్వాల ప్రతినిధి, జులై 01 ప్రభాతవార్త :** గద్వాల నూతన కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న ప్రతి ఒక్క సూపర్‌వైజర్లందరికి డిప్యూటి డిఎంహెచ్ఓ డా. సిద్ధప్ప ఆల్ ప్రోగ్రామ్స్‌లో రివ్యూ చేశారు. ప్రతి ప్రోగ్రాం ముందుకు వెళ్ల డానికి సూపర్ వైజర్లదే కీలకపాత్ర అని తెలియజేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో,సబ్ సెంటర్లలో పనిచేసే సిబ్బందిని బలోపేతం చేసి అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో ఆశా కార్యకర్తలకు, ఎఎన్ఎంలకు సూచనలు, సలహాలు ఇస్తూ ముందుకు వెళ్లాలని అప్పుడే మనలక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. అనంతరం ఎన్సీడీ టిబి లెప్రసీ సంజీవిని, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డులకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రతి ఒక్కరికి ఏబిహెచ్ఎ కలిగి ఉండాలని ఆసుపత్రిలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమానికి ఇంఛార్జి ఎస్ఓ తిరుమల్‌రెడ్డి, ఇంఛార్జి డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి, ఎన్సీడీ జిల్లా కో ఆర్డినేటర్ శ్యాంసుందర్, ఎల్డీ కంప్యూటర్ అస్లాం, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ క్యాడర్ అందరు పాల్గొన్నారు.

## మల్దకల్ శ్రీ తిమప్ప దేవాలయంలో అన్నదానం..



**గద్వాల ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త :** శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి మల్దకల్ గ్రామంలో శనివారం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండల పరిధిలోని నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన మార్కెట్ డైరెక్టర్ సవరన్న, బ్రదర్స్ తలారి పరశురాముడు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా దేవాలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్య చంద్రారెడ్డి, అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి శివాలయం దగ్గర ఉన్న నవగ్రహ మండలంలో శని త్రయోదశి సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రవి, దీరేంద్రదాస్ ఆధ్వర్యంలో శనేశ్వరునికి తైలాభిషేకాలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి,చక్రపాణిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మారెడ్డి, శ్రీను, శేఖరయ్య, జనార్ధన్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య:డీఈఓ



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. శనివారం జెడ్పీహెచ్ఎస్ గగ్గలపల్లి పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిప్రియ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా విద్యాధికారి గోవింద రాజులు, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, జెఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జమ్ముల సతీష్‌రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి కొద్ది దూరంలో పాఠశాల ఉండటంతో పాఠశాల సంరక్షణకై సతీష్‌రెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ మెరుగైన వసతులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుం దన్నారు.పాఠశాలఅభివృద్ధికి గ్రామస్తులు సహకరిస్తున్నారని గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీచైర్మన్ రామస్వామి,డీఎస్ఓ కృష్ణారెడ్డి,లయన్స్‌క్లబ్ హైదరాబాద్ ఎవరెస్ట్ అధ్యక్షులు బుచ్చన్న,గ్రామస్తులు జయకృష్ణ,ఉపాధ్యాయులు ఎం.నాగరాజు,గ్రామస్తులు ఉన్నారు.

## సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపిన గ్రూప్ 4 అభ్యర్థులు



**మహ్మదాబాద్,జులై 01 ప్రభాతవార్త :** మండలంలోని నంచర్ల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గ్రూప్ 4పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు స్థానిక సర్పంచ్ అనసూయ నారాయణ అభ్యర్థుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు 700ల మందికి వంటకాలు చేసి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గ్రూప్ 4 పరీక్ష రాయటానికి సుదూర ప్రాంతాల నుండి మా నంచర్ల గ్రామానికి వచ్చిన విద్యార్థులకు ఒక పూట అన్నం పెట్టే అవకాశం నాకు రావటం చాలా సంతోషంగా ఉందని ఉద్యోగాల కోసం అభ్యర్థులు చాలా రోజుల నుండి పిల్లలకు, కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎంతగానో కష్టపడి పరీక్ష రాయటానికి వచ్చిన ఏ ఒక్క అభ్యర్థి కూడా మధ్యాహ్న భోజనం గురించి వారి అమూల్యమైన సమయం వృధా చేసుకోవద్దనే ఆలోచనతో మా వంతుగా భోజన వసతిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్నదాన కార్యక్రమం చేపట్టినందుకు సర్పంచ్‌కు గ్రూప్ 4 అభ్యర్థులు వారి వెంట వచ్చిన వారు సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, ఏఈఓ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పతనం మొదలైంది..

**- టీపీసీసీ జనరల్ సెక్రెటరీ జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**- ఈర్లపల్లిలో 105మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక**



పార్టీలో చేరిన నాయకులతో అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 1, ప్రభాత వార్త :** బీఆర్ఎస్ పతనం మొదలైందని, తొమ్మిదేండ్ల పాలనలో ఏ వర్గం కూడా బాగుపడలేదని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. జడ్చర్ల మండలం ఈర్లపల్లి తండాలో వివిధ పార్టీల నుంచి 105 మంది నాయకులు, కార్యకర్తలు అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతులకు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూపంపిణీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అంటే భూ దందాల రాష్ట్ర సమితిగా మారిందని ఆరోపించారు. నోటిఫికేషన్లు లేక యవత నానా ఇబ్బందులు పడుతున్నా సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. హామీలు తప్పా అమలుకు నోచుకోని పథకాలు ఎన్నో ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే వంట గ్యాస్, ఏకకాలంలో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ,మొదటిఏడాదిలోనే రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని,ఇల్లులేని పేదలకు రూ. 5లక్షల ఆర్థికసాయం,రైతులకు,కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేల పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు.



ఈర్లపల్లి తండాలో అనిరుధ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-పరీక్షలు..

## 85శాతం హాజరు నమోదు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 01 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రూప్-4 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, తెల్కపల్లి, తిమ్మాజిపేట, బిజినపల్లి, బల్మూర్, పెద్దకొత్తపల్లి, వెల్దండ మండలాల కేంద్రాల్లో నిర్వహించిన 50 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 85 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1కు 16632 మందికిగా 14126 మంది హాజరు కాగా 2506 గైర్హాజరయ్యారని, అదే విధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పేపర్ 2 పరీక్షకు 16632 మంది అభ్యర్థులకు గాను 14094 హాజరు కాగా 2539 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుంచి నేరుగా ప్రత్యక్షంగా పరీక్షలను వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించి జిల్లా కేంద్రంల బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పలువురు అధికారులు గ్రూప్-4 పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.



దివ్యాంగులకు సహాయకురాలి పరీక్ష రాస్తున్న విద్యార్థి దృశ్యాన్ని తిలకిస్తున్న కలెక్టర్




పాఠశాలను సందర్శించి బయటకు వస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## దేవరకద్రలో నిజాయతీ చాటుకొన్న మహిళ..

**- దొరికిన పర్స్‌ను పోగొట్టుకొన్న మహిళకు అందజేత**



దేవరకద్రలో సుక్కమ్మకు పర్స్‌ను అందజేస్తున్న రేఖ

**దేవరకద్ర,జులై 01 ప్రభాతవార్త:**ఒ. పదిరూపాయలు దొరికితేనే మౌనంగా తీసుకొని పోయే నేటి రోజుల్లో.. దేవరకద్రకు చెందిన ఓ మహిళ తనకు దొరికిన పర్స్‌ను శనివారం సంబంధిత వ్యక్తులకు అందజేసి తన నిజాయతిని చాటుకొంది.తనకు తొరికిన పర్స్‌ను దానికి సంబంధించిన మహిళకుఅందజేసి తన నిజాయతిని నిరూపించుకొంది.వివరాలు ఈ విధంగా ఉన్నాయి.దేవరకద్ర మండలం వెంకటాయపల్లికి చెందిన సుక్కమ్మ హైద్రాబాద్‌లోని తన కొడుకు వద్దకు వెళ్తూ డబ్బులు,ఇంటి తాళాలు,ఫోటోలు పెట్టుకొన్న పర్స్‌ను దేవరకద్రలో పొగొట్టుకొంది.అయితే ఈ పర్స్ స్థానిక పాత బస్టాండు వద్ద మాంసం మార్కెట్ సమీపంలో డబ్బుపెట్టుకొన్న కుర్వ అశోక్ భార్య రేఖకు దొరికింది.దీంతో పర్స్ తెరచి చూడగా అందులో రూ.5,800 నగదుతో పాటు ఇంటితాళాలు, ఫోటోలు కనిపించాయి.దొరికిన పర్స్‌ను సంబంధిత వ్యక్తులకు అందజేయాలన్న ఉద్దేశ్యంతో వాటిని రేఖ భర్త అశోక్ తన ఫోన్ నెంబరుతో సహా దేవరకద్ర వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేశారు.ఈ విషయం తెలుసుకొన్న పర్స్‌కు సంబందించిన సుక్కమ్మ ఫోన్ నెంబరు ఆధారంగా రేఖ వద్దకు వచ్చి జరిగిన విషయాన్ని చెప్పింది.దీంతో అట్టి పర్స్‌ను సుక్కమ్మకు రేఖ అందజేసింది.దీంతో సుక్క మ్మ తాను పొగొట్టుకొన్న పర్స్ తనకు లబించడంతో రేఖకు కృతజ్ఞతలు తెలిపింది.అయితే నిజాయతిగా తనకు దొరికిన పర్స్‌ను సంబంధిత వ్యక్తులకు అందజేయడంతో అశోక్,రేఖ దంపతులను పట్టణ ప్రజలు అభినందించారు.

## సిబ్బందిని సన్మానించిన సింగిల్‌విండో పాలకవర్గం..



సింగిల్ విండో పాలక వర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

**అయిజ,జులై 01 ప్రభాతవార్త :** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక రుణాలను రికార్డు స్థాయిలో వసూలు చేసి భవిష్యత్తులో మళ్లీ రుణాలు ఇచ్చేందుకు కారణమైన సింగిల్‌విండో సీఈఓ మల్లేష్, ఎల్‌టి లోన్ వసూళ్ల ఇంఛార్జి జీవన్‌లను శనివారం విండో కార్యాలయంలో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు హుసేని, బడేసాబ్ రాజులతో కలిసి శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పోతుల మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక రుణాలు వసూలు చేయడంలో ఏ సంవత్సరం 50 శాతం వసూలు మించలేదని దీనివల్ల గత 15సంవత్సరాలుగా సింగిల్ విండో ద్వారా దీర్ఘకాలిక రుణాలు రైతులకు అందజేసే పరిస్థితి ఉండేది కాదన్నారు. 30,40 సంవత్సరాల క్రితం తాతలు తీసుకున్న రుణాన్ని వారు లేకున్నా గతించినా, తీసుకున్న అప్పును చెల్లించాలనే స్పృహతో బకాయిపడ్డ రైతులు సింగిల్ విండోకు సహకరించి, తమ బకాయిలను చెల్లించడం వల్ల తిరిగి కొత్తగా రైతులకు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చేందుకు బాట వేశారని ఆయన అన్నారు. ఈ సంవత్సరం సీఈఓ మల్లేష్, దీర్ఘకాలిక రుణాల వసూల ఇంచార్జి జీవన్‌లు శక్తివంచన లేకుండా కృషి చేసి 61 మంది రైతులు ఒక్క కోటి 12 లక్షల 15 వేల 239 రూపాయలు బకాయి ఉండగా, 40 మంది రైతుల నుండి డబ్బులు వసూలు చేసి 67 శాతం వృద్ధిరేటు సాధించి సింగిల్‌విండోకు మంచి పేరు వచ్చిందన్నారు. ఇంకా 21 మంది రైతుల నుండి 50 లక్షల రూపాయల దీర్ఘకాలిక అప్పులు వసూలు చేయాల్సి ఉందన్నారు. దీర్ఘకాలిక రుణాలు ఇచ్చేందుకు ఐజ సింగిల్ విండోకు అర్హత వచ్చినందున ఈ ఆర్థిక సంవత్సరం నుంచి గొర్రెలు, బర్రెలు, పౌల్ట్రీ ఫామ్ తదితర స్కీములకు రైతుల పొలాలను తనఖా చేసుకుని అప్పులు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో సిబ్బంది భీమార్జున్‌రెడ్డి, టి. శ్రీనివాస్, ఆంజనేయులు, భక్త ప్రహ్లాద, హరి, తిరుమలేష్, భాస్కర్, రఘు పాల్గొన్నారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం..



డాక్టర్ శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



వైద్యుడు రాజుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 1, ప్రభాతవార్త :** వైద్యుల దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన జనరల్ దవాఖానలో వైద్యులను సన్మానించారు. జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోని రాంరెడ్డి క్లీనిక్, శ్రీధర్‌రెడ్డి క్లీనిక్, నరసింహారెడ్డి క్లీనిక్, కిరణ్ క్లీనిక్ లో డాక్టర్లను ఘనంగా సన్మానించారు. జడ్చర్లలో ఆర్ఎంపీ వైద్యులు రాజుగౌడ్‌ను స్థానికులు సన్మానించారు. శాలువాలు పూల బొకేలతో సత్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని వైద్యుల సేవలను వెలకట్టలేమని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాట్రపల్లి లక్ష్మయ్య, తెలంగాణ మైనార్టీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ హఫీజ్, కౌన్సిలర్ సుంకసారి రమేష్, మాజీ సర్పంచ్ రేణుక, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చల శ్రీను, మొగులయ్య, కిరణ్‌కుమార్, కోనేటి నరసింహ, శాంతయ్య, వెంకటయ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు ..

**పరిష్కరించాలని మండల విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా**



వినతి పత్రం సమర్పిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

**మాగనూరు,జులై 01 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహన భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాగనూరు మండల విద్యాధికారి కార్యాలయం ముందు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా కో కన్వీనర్ పుంజనూరు ఆంజనేయులు మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల మెనూ చార్జీలను పెరుగుతున్న ధరలకనుగుణంగా పెంచాలని కోడిగుడ్డుకు అదనపు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా 2022 మార్చిలో ప్రకటించిన 3 వేల గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, యూనిఫామ్, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని, పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని తదితర డిమాండ్లతో కూడుకున్న వనతి పత్రాన్ని ఎంఈఓ కార్యాలయంలోని స్వన్నకు అందజేశారు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షులు ప్రమీల, మండల కార్యదర్శి శంకరమ్మ మాట్లాడుతూ జులై 10,11,12 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు టోకెన్ సమ్మెకు యూనియన్ పిలుపునిచ్చిందన్నారు. మాగనూరు మండలంలో మూడురోజుల టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కోశాధికారి లక్ష్మిదేవమ్మ, మండల సహాయ కార్యదర్శి గంగమ్మ, గౌసియా, రాధ,సుగుణమ్మ, వెంకటమ్మ, గజలమ్మ, మారమ్మ, గంగమ్మ 30 మంది పాల్గొన్నారు.

## పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో ప్రదీప్‌కుమార్‌గౌడ్

**దేవరకద్ర,జులై 01 ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లాలో శనివారం జరిగిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో దేవరకద్రకు చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జనగర్జన సభ కోఆర్డినేటర్ ఒబుదుల్లా కొత్వాల్,సంజీవ్‌ముదిరాజ్,కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో ప్రదీప్‌కుమార్‌గౌడ్

## ముచ్చోనిపల్లె గ్రామకమిటీ ఎన్నిక..




**గద్వాల ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త :** గట్టు మండలం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో గట్టు మండలం ముచ్చినిపల్లె గ్రామ కమిటిని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కె.నరసింహులు, లింగన్న, ఉపాధ్యక్షులుగా కె.రాజశేఖర్,సురేష్, కార్యదర్శిగా నరేంద్ర, సహాయ కార్యదర్శులుగా గోవిందు, సుమన్, సోషల్ మీడియా ఇంఛార్జిగా వినోద్, కమిటి సభ్యులుగా శేఖర్, కె. వీరన్న, కె. వీరాంజనేయులు, కె. నర్సింలు, భీమన్న, కె. గోవిందులను కోరడం జరిగింది. ఈ సందర్భంగా గొంగళ్ల రంజిత్‌కుమార్ రాబోయే రోజుల్లో గద్వాల గడ్డను కుటుంబ పాలన నుండి విముక్తి చేసి పేదల తరపున అట్టడుగు వర్గాల తరపున బహుజన జెండా ఎగురవేయాలని అన్నారు.

## ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అందించాలి..

**హామీ ఇచ్చి సంవత్సరమైనా పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇండ్లు**

**టిడబ్ల్యుజెఎఫ్ ఉమ్మడి గండీడ్ నీమండల అధ్యక్షుడు నవీన్‌కుమార్**



**మహ్మదాబాద్,జులై 01 ప్రభాతవార్త :** మహ్మదాబాద్, గండీడ్ మండలాలకు చెందిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్‌రూంలు అందించాలని శనివారం పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అధ్యక్షుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి గండీడ్ మండలంలోని ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించాలని ఇంతకుముందే తమ దృష్టికి పలుమార్లు తీసుకొచ్చామని గండీడ్ మండల పరిషత్ కార్యాలయంలో టిడబ్ల్యుజెఎఫ్ సమావేశం ఏర్పరచుకున్న సందర్భంగా సమావేశంలో వారి దృష్టికి తీసుకురావడంతో జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తానని చెప్పడం జరిగిందని సమావేశం జరిగి సంవత్సరం కావస్తుందన్నారు. ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూంల గురించి చాలాసార్లు కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, టిడబ్ల్యుజెఎఫ్ ఉమ్మడి గండీడ్ మండల అధ్యక్షుడు హస్నాబాద్ రామకృష్ణారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గ కమిటి టియుడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి యూనియన్ సభ్యులు వెంకటేష్ పాల్గొన్నారు.

## ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు తరలిరండి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్**



**అమరచింత,జులై1,ప్రభాతవార్త:** అమరచింతలోని దుంపాయికుంటలో పేదలు వేసుకున్న గుడిసెల లబ్ధిదారులతో ఎస్ అజయ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 68 సెంటర్లలో పేదలు వేసుకున్న గుడిసెల లబ్ధిదారులందరి పట్టాలు పంపిణీ చేసి వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని డిమాండ్‌తో ఈనెల 3వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు ప్రజలకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. గృహలక్ష్మి పథకంలోని నిబంధనలను సవరించి అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని కోరారు. గృహలక్ష్మి పథకం కింద 5 లక్షలకు పెంచాలని కోరారు. 2016 పించన్‌ను రూ.3016 పెంచాలని, కొత్త రేషన్ కార్డులకు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ ధర్నాకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో మాసన్న,వసంతి,కవిత, లలిత, మనెమ్మ, బాబు, చిట్టెమ్మ,భాగ్యమ్మ,శాంతమ్మ,సత్యమ్మ, అరుణమ్మ, మునెప్ప, గూడెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వంగూరు, జులై 01 ప్రభాతవార్త:**వంగూరు మండలం ఉమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ భార్య ఈశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అం డగా ఉంటుందన్నారు. పేద కుటుంబాల్లో ఆపద వస్తే ఆదుకొని వారికి అండగా నిలబడి ఆదుకోవడంలో ఉండే సంతోషానికి అవధులు లేవని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలయ్య, భగవంతు, మల్లయ్య, సత్యనారి,వెంకటయ్య, చందు, శ్రీశైలం, పరమేష్, గణేష్, బాలస్వామి, శ్రీను, జగతయ్య తదితరులు ఉన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 4 పరీక్షలు

**- 85 శాతం హాజరు నమోదు - జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి, జూలై1, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో గ్రూప్ 4 పరీక్షలు ప్రశాంతంగా విజయవంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 85 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వనపర్తి జిల్లాలో 13684 అభ్యర్థులకు గాను ఉదయం 10 గంటల నుండి 12:30 వరకు జరిగిన పేపర్ 1కు 11725 మంది హాజరు కాగా 1959 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పేపర్ 2 గ్రూప్ 4 పరీక్షకు 11683 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 2001 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగాయని తెలిపారు.



# విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు..

**-జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్**

**వెల్దండ, జూలై 01 ప్రభాతవార్త:** విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తోందని, ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో కొట్ర గ్రామ సేవా సమితి అధ్యక్షులు పొనుగోటి రవీందర్‌రావు జన్మదినోత్సం సందర్భంగా జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక, అప్పర్ పీఎస్ పాఠశాలల్లో రవీందర్‌రావుతో కలిసి జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మన ఊరు-మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో అన్ని హంగులతో వసతులను కల్పించడమైందన్నారు. ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యాలకు చేరుకొని తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**మద్దూరు, జూలై 01 ప్రభాతవార్త :** నూతనంగా ఏర్పడిన కొత్తపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెళ్లయిన ఆడపిల్లల తల్లిదండ్రులకు అండగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వము కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ఒక లక్ష 116 ఆర్థిక సాయం తల్లిదండ్రులకు అందిస్తుంది. బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆడపిల్లల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకొని వచ్చింది. ఆడపిల్లల అభివృద్ధి కోరుకుంటున్న ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోస్గి వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ వీరారెడ్డి, పిఎస్‌సిఎస్‌సి ఛైర్మన్ జగదీశ్వర్లు, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడి మండల అధ్యక్షుడు సి. వెంకటయ్య, మండల సీనియర్ నాయకులు ఎండి సలీం, హన్మిరెడ్డి, బొబ్బిలి తిరుపతిరెడ్డి, మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైద్యులు దైవంతో సమానం..

**- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్**

**వనపర్తి టౌన్, జూలై1, ప్రభాతవార్త:** తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని వనపర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నా యకులు శ్రీనివాస్‌గౌడ్ అన్నా రు. అంతర్జాతీయ వైద్యుల ది నోత్సవం సందర్భంగా శనివా రం వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీసాయి క్లినిక్‌లో జిల్లా మలే రియా అధికారి డాక్టర్ సాయి నాథ్‌రెడ్డి కొత్తకోట ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ పరిమళ ను ఘనంగా శాలువా పూల మాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... సాయినాథ్ రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా వనపర్తి జిల్లా ప్రజలకు సేవలందిస్తు ప్రజల వైద్యునిగా నిలిచారని ఆయన గుర్తు చేసుకున్నారు. వైద్య వృత్తిని ఎంచుకున్న వైద్యులు పేద ప్రజలకు దైవ సమానులుగా నిలుస్తున్నారని కరోనా సమయంలో ఎంత మంది కరోనా వ్యాధికి గురైనా రోగులను కాపాడి వారికి పునర్జన్మను కల్పించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసపురం మాజీ ఉప సర్పంచ్ చీర్ల జనార్ధన్, ఆసుపత్రి సిబ్బంది అల్తాఫ్ తదితరులు ఉన్నారు.



# అయిజ సింగిల్ విండో కార్యాలయాన్ని సందర్శించిన అధికారుల బృందం

**అయిజ, జూలై 01 ప్రభాతవార్త :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరు పరిశీలనలో భాగంగా భాగంగా రాష్ట్ర నాబార్డు అధికారుల అధ్యయన బృందం శనివారం అయిజ సింగిల్ విండో కార్యాలయాన్ని సందర్శించింది. మహబూబ్‌నగర్ నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి షణ్ముగచారి నేతృత్వంలో రాష్ట్ర నాబార్డు కార్యాలయం నుండి నాబార్డు అధికారులు దీప్తి మాధురీలు పాల్గొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్కో సింగిల్ విండో పని తీరును ఎంపిక చేసుకున్న అధికారులు అందులో భాగంగా అయిజ సింగిల్ విండో కార్యాలయాన్ని సందర్శించారు. గతంలో సింగిల్ విండో పనితీరును, ఈ మధ్యకా లంలో జరిగిన అభవృద్ధిని పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతవరకు రైతులకు వివిధ సేవలు అందిస్తున్న అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులే కాకుండా మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన, సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించాలనే ఉద్దేశంతో సింగిల్‌విండో ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్‌ను నాబార్డు నిధులతో ఏర్పాటు చేస్తున్న విషయాన్ని వారు పరిశీలించారు.



# ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్షలు..

**వెల్దండ, జూలై 01 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలు సజావుగా కొనసాగాయి. కొంత మంది అభ్యర్థులు సమయం దాటిన తర్వాత పరీక్ష కేంద్రానికి చేరుకోగా అధికారులు అనుమతివ్వ లేదు. జాతీయ రహదారి నుంచి పరీక్ష కేంద్రం 1 కిలో మీటర్ దూరంగా ఉండటంతో కొంతమంది అభ్యర్థులను ఎస్ఐ శ్రీనివాస్ సూచన మేరకు పోలీస్ వాహనంలో తీసుకెళ్లారు. 702 మంది అభ్యర్థులకు గాను 563 మంది హజరయ్యారు. 139 మంది అభ్యర్థులు గైర్హజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ప్రత్యేకాధికారి ప్రత్యనాయక్, సీఎస్ పుష్పలత, రాధకృష్ణలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.



తల్లి పరీక్ష రాయడానికి వెళ్తే భోజనం తినిపిస్తున్న తండ్రి



పోలీస్ వాహనంలో సెంటర్‌కు చేరుకున్న అభ్యర్థులు

# క్లాస్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్‌డే..

**కల్వకుర్తి, జూలై 01, ప్రభాతవార్త:** సేవాబావంతో వైద్యులు ప్రజలకు వైద్య సేవలందించాలని క్లాస్‌మెంట్ క్లబ్ కల్వకుర్తి డివిజన్ అధ్యక్షులు బాదం రాఘవేందర్ పేర్కొన్నారు. డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ వైద్యశాల కల్వకుర్తిలో పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందిని క్లాస్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో విలువైనదని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే దైవాలు డాక్టర్లు అని ఆయన అన్నారు. వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందన్నారు. ఎంత డబ్బు ఉన్న కొనలేనిది ప్రాణం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న డాక్టర్ల సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిగుళ్లపల్లి శ్రీధర్, గుబ్బ కిషన్ తదితరులు ఉన్నారు.

**మిత్ర పౌండేషన్ ఆధ్వర్యంలో....** మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో డాక్టర్స్‌డే సందర్భంగా గవర్నమెంట్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, యశోదబాయి, స్వర్ణలతలతో పాటు పలువురిని ఫౌండేషన్ చైర్మన్ కుడుముల చంద్రకాంత్‌రెడ్డి శాలువాలో ఘనంగా సన్మాని ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే పునర్జన్మ అందించేది కేవలం డాక్టర్లు మాత్రమేనని, అటువంటి డాక్టర్స్‌ను మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



క్లాసిమెంట్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం



మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

# సాయి నిఖిల్ యాదవ్ యువ భారత వాయుసేన అధికారి ఎందరో యువకులకు ఆదర్శం

**- వనపర్తి జిల్లా యువ కెరటం సాయి నిచల్ యాదవ్‌కు అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి, జూలై1, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ అయిన చంద్రకళ కృష్ణ దంపతులకు పుట్టిన సాయినిచల్ యాదవ్ భారత వాయుసేనలో ఎయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్ గా పాసింగ్ అవుట్ కావడంతో జిల్లాకుఎంతో గర్వకారణం అని జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సాయి నిచల్‌తో పాటు వారి తల్లిదండ్రులకు శాలువాతో సత్కరించారు. సాయి నిచల్‌యాదవ్‌కు మెమోంటో బహుకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 2019లో సాయినిచల్ ఎన్‌డీఏకు ఎంపికై మూడు సంవత్సరాల విద్య పూర్తిచేసుకుని ఎయిర్ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా పాసింగ్ అవుట్ అయ్యారని తెలిపారు. ఇది వనపర్తిజిల్లాకు ఎంతో గర్వకారణం అని సాయినిచల్ యాదవ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇంకా మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సాయి నిచల్ తల్లి చంద్రకళ, తండ్రి కృష్ణ ఉన్నారు.



సాయి నిచల్ యాదవ్‌ను, తల్లిదండ్రులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# పల్లెల అభివృద్ధే బీజేపీ లక్ష్యం...

**- అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ నేత శ్రీకాంత్ భీమా**

**అచ్చంపేట, జూలై 01 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించి ప్రకృతవనం, వైకుంఠదామాలు, ఇంకుడు గుంతలను నిర్మించేందుకు ప్రత్యేక నిధులను కేటాయించి పల్లెల అభివృద్ధి, ప్రజల ఆరోగ్యాన్ని బాగు పర్చేందుకు కృషి చేస్తుందని అచ్చంపేట బీజేపీ నియోజవర్గ నేత శ్రీకాంత్ భీమా పేర్కొన్నారు. శనివారం అచ్చంపేట నియోజకవర్గంలోని రంగాపూర్ గ్రామంలో మోడీ హయంలో 9 సంవత్సరాల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ డోర్ స్టిక్కర్లు, కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న ఏడేళ్ల చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మానసిక వైద్యానికి సంబంధించిన కేంద్రానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పార్టీ అందిస్తున్న నిధులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు మేమే చేస్తున్నామని ప్రగల్బాలు పలుకుతున్నారే తప్ప పల్లెలను అభివృద్ధి పర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో పల్లెల అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆచరణలో శూన్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వమని, ఎన్నిక సమయంలో గద్దెనెక్కేందుకు ప్రజలను మోసం చేసేందుకు ఎన్నో కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగిస్తున్నారు తప్ప ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో అచ్చంపేట నియోజకవర్గంలో బీజేపీ జెండాను ఎగురవేసి ఈ ప్రాంత అభివృద్ధికి దోహద పడుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా నాయకులు హామీద్, సీనియర్ నాయకులు గండికోట కృష్ణ, తిరుపతయ్య, కమల, శివ, శ్రీకాంత్, మల్లేష్, అనిల్, రమేష్ తదితరులు ఉన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

# సేంద్రియ వ్యవసాయంపై రైతు అవగాహన సదస్సు..

**చిన్నచింతకుంట, జూలై 01 ప్రభాతవార్త :** సేంద్రీయ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన సదస్సును ఈనెల 3న అప్పంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు గ్రామ భారతి జిల్లా అధ్యక్షులు అమరవాది రాజనర్సింహ తెలిపారు. శనివారం అప్పంపల్లి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడడం వల్ల భూమి విషతుల్యంగా మారుతుందన్నారు. మనం తినే ఆహారంలో రసాయనిక ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దీంతో ఎన్నో వింత రోగాలతో మనుషులు ఆసుపత్రుల పాలవుతున్నారు. చివరికి క్యాన్సర్ వంటి భయంకరమైన రోగాల బారిన పడి మరణాలు సైతం సంభవిస్తున్నాయన్నారు. విరివిగా రసాయనిక ఎరవుల వాడకంతో భూమిలోని జీవరాసులు సైతం చనిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేలతల్లిని కాపాడుకునేందుకు కొంతమంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తూ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందిస్తూ ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరికి గ్రామభారతి సంస్థ తమ వంతు సహకారం అందిస్తూ రైతు అవగాహనా సదస్సులను ఏర్పాటు చేస్తుందన్నారు. అప్పంపల్లి గ్రామంలో నీ ఉన్నత పాఠశాల వద్ద ప్రకృతి రైతుల అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవగాహన సదస్సుకు అప్పంపల్లి, దాసర్‌పల్లి, తిర్మలాపూర్, మద్దూరు, ముచ్చింతల, గుడిబండ, మీనోగోనిపల్లి, కొౌకుంట్ల, దేవరకద్ర, లాల్‌కోట, పల్లమర్రి, ఎదులాపూర్, నెల్లికొండి, చిన్న వడ్డెమాన్, పెద్దవడ్డెమాన్, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రకృతి సేద్యం విధానాలు సందేహాలను రైతులు నివృత్తి చేసుకోవాలని కోరారు. గ్రామ భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, ప్రచార విభాగ కార్యదర్శి గుముడాల చక్రవర్తిలు ఉన్నారు.

# స్వీపర్ల డిమాండ్లను పరిష్కరించాలి..

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి - మహబూబ్‌నగర్‌లో స్వీపర్ల నిరసన దీక్షలకు మద్దతు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 1, ప్రభాతవార్త :** పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద స్వీపర్లు నిర్వహిస్తున్న నిరసన దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. స్వీపర్ల సమస్యలు పరిష్కరించే వరకు వారికి మద్దతుగా బీజేపీ పోరాడుతుందన్నారు. నెల జీతం వస్తుందో రాదో అనే అభద్రత భావంతో జీవితాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60ఏండ్లు పైబడిని వారికి ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలలో స్వీపర్లు దశాబ్ద కాలంగా అరకొర జీతాలతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, జిల్లా పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు నారాయణయాదవ్, శ్రీశైలం యాదవ్, స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టన్న, టీఎఫ్‌యూ జిల్లా అధ్యక్షుడు పి విజయ్‌కుమార్, స్వీపర్లు పాల్గొన్నారు.



స్వీపర్లకు మద్దతుగా దీక్షలో కూర్చున్న వీరబ్రహ్మాచారి

# నల్ల చెరువును జిల్లా ప్రజలు ఆహ్లాదం కోసం ఉపయోగించుకునే విధంగా తీర్చిదిద్దాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి, జూలై1, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణ శివారులో ఉన్న నల్ల చెరువును జిల్లా ప్రజలు ఆహ్లాదం కోసం ఉపయోగించుకునే విధంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డితో కలిసి నల్ల చెరువును సందర్శించారు. చెరువు చుట్టు ఒక ప్రణాళిక ప్రకారం మొక్కలు నాటాలని, ప్రజలు ఉదయం, సాయంకాలం సేద తీరేందుకు పిల్లలు ఆహ్లాదం కోసం సందర్శించే విధంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అవసరం అయినప్పుడు ఒక సమావేశం లేదా వేడుక నిర్వహించుకునే విధంగా చూడాలని సూచించారు. మంచి మొక్కలు నాటే విధంగా చూడాలని, ముందుగా ఎక్కడెక్కడ ఎలా నాటాలి అనేది ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.



చెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్







నల్ల చెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# బిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రూప్4 పరీక్ష రాసే అభ్యర్థులకు అన్నదాన కార్యక్రమం



**గండీడ్, జూలై 01 ప్రభాతవార్త :** గండీడ్ మండలం వెన్నచెడ్ గ్రామంలో శనివారం జరిగిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 4 పరీక్ష కేంద్రం ఏర్పాటు అవడంతో సుమారు 1000 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉందని దీనికి తోడు పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండువిభాగాలుగా ఉండడంతో అభ్యర్థులకు సరైన భోజన సదుపాయం ఉండకపోవచ్చని గ్రహించిన బిఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు సమస్యను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి ఛైర్మన్ మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన మనోహరెడ్డి మధ్యాహ్నం పరీక్షకు హాజరైన అభ్యర్థులకు బిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

# సివిల్స్ శిక్షణకు దరఖాస్తులకు నేడే ఆఖరు..

**మహబూబ్‌నగర్‌బ్యూరో, జూలై 1, ప్రభాతవార్త :** 2023-24 విద్యా సంవత్సరానికిగానూ షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి సంస్థకు చెందిన రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్, బంజారా హిల్స్ హైదరాబాద్‌లో సివిల్స్ ప్రిలిమినరీ మరియు మెయిన్స్ సీ -సాట్ కోచింగ్‌కోచింగ్ కోసం నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇందుకుగానూ కోచింగ్ కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి రాతపరీక్ష ద్వారా 100మందిని ఎంపిక చేయనున్నారు. ఎంపికైనవారికి ఉచిత భోజన వసతితో రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో 10నెలల కోచింగ్ ఇస్తారు. శిక్షణకు నేటి ఆదివారంతో (జూలై2) దరఖాస్తుకు చివరితేదీగా నిర్ణయించినట్లు మహబూబ్‌నగర్ ఎస్సీ స్టడీ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష జూలై9న నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు 04023546552 నెంబర్‌ను సంప్రదించాలి కోరారు.

# దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత...



**వెల్దండ, జూలై01 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో నూతనంగ నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణనికి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి రూ. 20వేలు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్ యాదవ్ రూ. 25వేలను సర్పంచ్ అంజినాయక్‌తో పాటు దేవాలయ కమిటీ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణాన్ని నాణ్యతగా చేపట్టి అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో రేషన డీలర్ల సంఘం మండల అధ్యక్షులు టి. జంగయ్య, మాసుల బాలరాజుతో పాటు ఉన్నారు.

# యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు అందజేత...



**వెల్దండ, జూలై 01 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో శనివారం ఎంఈఓ శంకర్‌నాయక్, ప్రధానోపాధ్యా యులు జైపాల్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు నోటు పుస్తకాలను అందించారు. సేవా సభ్యులను ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శ్రీనాథ్, గీతతో పాటు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు సైకిల్ అనీమియా వైద్య పరీక్షలు

**లింగాల, జూలై 01 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు సీకిల్ అనీమియా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అంబట్‌పల్లి వైద్యాధికారిణి ప్రియాంక అన్నారు. అంబట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొత్తకుంటపల్లి గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు సీకిల్ అనీమియా వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందు జాగ్రత్తగా చిన్న పిల్లలకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు సీకిల్ అనీమియా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారిణి ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, ఆశా కార్యకర్తలు రాధ, భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రామస్వామి, బాలాంజనేయులు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



## రెండు తలల గొర్రెపిల్ల జననం..!

**-దేవరకద్రలో అరుదైన సంఘటన**



**దేవరకద్ర,జులై 01 ప్రభాతవార్త:** దేవరకద్రలో శనివారం ఓ గొర్రెకు రెండు తలల గొర్రె పిల్ల(ఆడది) జన్మించింది.దేవరకద్రలో ఈ అరుదైన సంఘటన జరిగింది.స్థానిక గొర్లకాపరి మల్లేశ్‌కు చెందిన గొర్రె ఈ విధంగా రెండు తలల గొర్రెపిల్ల జన్మించింది.పుట్టిన దాదాపు 12 గంటల తరువాత ఆ గొర్రెపిల్ల మృతి చెందింది.దీంతో ఆ గొర్రెపిల్లను చూడటానికి చాలామంది ఆసక్తి కనబరిచారు.జినటిక్ లేదా హార్మోన్‌ల ప్రభావం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని మండల పశువైద్యాధికారి జీషాన్‌అలి తెలిపారు.ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతాయన్నారు.కాని ఈ విధంగా జన్మించిన గొర్రెపిల్లలు బతుకవని పశువైద్యాధికారి తెలిపారు.

## హెల్త్ ప్రోగ్రామ్స్ ముందుకు నడిపించే కీలకపాత్ర సూపర్‌వైజర్లదే బాధ్యత

**డిప్యూటి డిఎంహెచ్ఓ డా.సిద్ధప్ప**



**గద్వాల ప్రతినిధి, జులై 01 ప్రభాతవార్త :** గద్వాల నూతన కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న ప్రతి ఒక్క సూపర్‌వైజర్లందరికి డిప్యూటి డిఎంహెచ్ఓ డా. సిద్ధప్ప ఆల్ ప్రోగ్రామ్స్‌లో రివ్యూ చేశారు. ప్రతి ప్రోగ్రాం ముందుకు వెళ్లడానికి సూపర్ వైజర్లదే కీలకపాత్ర అని తెలియజేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో,సబ్ సెంటర్లలో పనిచేసే సిబ్బందిని బలోపేతం చేసి అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో ఆశా కార్యకర్తలకు, ఎఎన్ఎంలకు సూచనలు, సలహాలు ఇస్తూ ముందుకు వెళ్లాలని అప్పుడే మనలక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. అనంతరం ఎన్సీడీ టిబి లెప్రసీ సంజీవిని, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డులకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రతి ఒక్కరికి ఏబిహెచ్ఎ కలిగి ఉండాలని ఆసుపత్రిలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమానికి ఇంఛార్జి ఎస్ఓ తిరుమల్‌రెడ్డి, ఇంఛార్జి డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి, ఎన్సీడీ జిల్లా కో ఆర్డినేటర్ శ్యాంసుందర్, ఎల్డీ కంప్యూటర్ అస్లాం, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ క్యాడర్ అందరు పాల్గొన్నారు.

## మల్దకల్ శ్రీ తిమప్ప దేవాలయంలో అన్నదానం..



**గద్వాల ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త :** శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి మల్దకల్ గ్రామంలో శనివారం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండల పరిధిలోని నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన మార్కెట్ డైరెక్టర్ సవరన్న, బ్రదర్స్ తలారి పరశురాముడు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్య చంద్రారెడ్డి, అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషే కాలు నిర్వహించి శివాలయం దగ్గర ఉన్న నవగ్రహ మండలంలో శని త్రయోద శి సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రవి, దీరేంద్రదాస్ ఆధ్వర్యంలో శనేశ్వరునికి తైలా భిషేకాలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి,చక్రపాణిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మారెడ్డి, శ్రీను, శేఖరయ్య, జనార్ధన్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య:డీఈఓ



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జూలై 01 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. శనివారం జెడ్పీహెచ్ఎస్ గగ్గలపల్లి పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిప్రియ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, జెఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జమ్ముల సతీష్‌రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి కొద్ది దూరంలో పాఠశాల ఉండటంతో పాఠశాల సంరక్షణకై సతీష్‌రెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ మెరుగైన వసతులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుం దన్నారు.పాఠశాలఅభివృద్ధికి గ్రామస్తులు సహకరిస్తున్నారని గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీచైర్మన్ రామస్వామి,డీఎస్ఓ కృష్ణారెడ్డి,లయన్స్‌క్లబ్ హైదరాబాద్ ఎవరెస్ట్ అధ్యక్షులు బుచ్చన్న,గ్రామస్తులు జయకృష్ణ,ఉపాధ్యాయులు ఎం.నాగరాజు,గ్రామస్తులు ఉన్నారు.

## సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపిన గ్రూప్ 4 అభ్యర్థులు



**మహ్మదాబాద్,జులై 01 ప్రభాతవార్త :** మండలంలోని నంచర్ల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గ్రూప్ 4పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు స్థానిక సర్పంచ్ అనసూయ నారాయణ అభ్యర్థుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు 700ల మందికి వంటకాలు చేసి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గ్రూప్ 4 పరీక్ష రాయటానికి సుదూర ప్రాంతాల నుండి మా నంచర్ల గ్రామానికి వచ్చిన విద్యార్థులకు ఒక పూట అన్నం పెట్టే అవకాశం నాకు రావటం చాలా సంతోషంగా ఉందని ఉద్యోగాల కోసం అభ్యర్థులు చాలా రోజుల నుండి పిల్లలకు, కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎంతగానో కష్టపడి పరీక్ష రాయటానికి వచ్చిన ఏ ఒక్క అభ్యర్థి కూడా మధ్యాహ్న భోజనం గురించి వారి అమూల్యమైన సమయం వృధా చేసుకోవద్దనే ఆలోచనతో మా వంతుగా భోజన వసతిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్నదాన కార్యక్రమం చేపట్టినందుకు సర్పంచ్‌కు గ్రూప్ 4 అభ్యర్థులు వారి వెంట వచ్చిన వారు సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, ఏఈఓ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పతనం మొదలైంది..

**- టీపీసీసీ జనరల్ సెక్రెటరీ జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**- ఈర్లపల్లిలో 105మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక**



పార్టీలో చేరిన నాయకులతో అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 1, ప్రభాత వార్త :** బీఆర్ఎస్ పతనం మొదలైందని, తొమ్మిదేండ్ల పాలనలో ఏ వర్గం కూడా బాగుపడలేదని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. జడ్చర్ల మండలం ఈర్లపల్లి తండాలో వివిధ పార్టీల నుంచి 105 మంది నాయకులు, కార్యకర్తలు అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతులకు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూపంపిణీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అంటే భూ దందాల రాష్ట్ర సమితిగా మారిందని ఆరోపించారు. నోటిఫికేషన్లు లేక యువత నానా ఇబ్బందులు పడుతున్నా సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. హామీలు తప్పా అమలుకు నోచుకోని పథకాలు



ఎన్నో ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే వంట గ్యాస్, ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ,మొదటిఏడాదిలోనే రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని,ఇల్లులేని పేదలకు రూ.5లక్షల ఆర్థికసాయం,రైతులకు,కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేల పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు.

## వైద్యుడు అంటే ప్రాణాలు రక్షించే దేవుడితో సమానం..!

**- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**- నూతన డయాగ్నోస్టిక్ సెంటన్‌ను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించిన మంత్రి హరీష్‌రావు**

**- జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్**

**- జీజీహెచ్‌లో డాక్టర్ రూమ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన**



డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి వైద్య విభాగం,జూలై1,ప్రభాతవార్త:** వైద్య వృత్తి ప్రాణాలు రక్షించే దేవుడితో సమానం అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన డయాగ్నోస్టిక్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు హైదరాబాద్ నుండి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించగా జిల్లా కలెక్టర్ వనపర్తి డయాగ్నోస్టిక్ సెంటర్‌కు హాజరయ్యారు. అనంతరం మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ బాలింతలకు, చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. బాలింతలకు కేసీఆర్ కిట్‌ను అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి,ఇంకా ఎలాంటి మౌలిక సదుపాయాలు కావాలి,వైద్య సిబ్బంది కొరత ఏమైనా ఉందా ఇంకా ఖాళీలు ఉన్నాయా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్య వృత్తి అనేది చాలా పవిత్రమైన వృత్తి అని, వైద్యుడు అంటే కనిపించే దేవుడేనని కొనియాడారు. వనపర్తి జిల్లాలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలతో పాటు ఆధునికమైన డయాగ్నోస్టిక్ సెంటర్ అందుబాటులోకి వచ్చిందని అవసరమైన మేరకు వైద్య సిబ్బంది నియామకం సైతం జరిగినందున ఇక పేద ప్రజలకు చాలా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి పేద ప్రజలు అధికంగా వస్తారని వారికి వైద్యులు, వైద్య సిబ్బంది ఆదరించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి పేదల ప్రజలు అధికంగా వస్తారని వారికి వైద్యులు వైద్య సిబ్బంది ఆదరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రకుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునందిని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ బంగారయ్య, డాక్టర్ ప్రభాకర్, హెచ్‌వోడీలు డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, ఇతర డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేర రహిత సమాజం కోసం కృషి చేయాలి: ఎస్పీ నరసింహ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 01 ప్రభాతవార్త :** ఒక్క నేరస్తుడు కూడా శిక్ష నుండి తప్పించుకోకూడదని మహబూబ్‌నగర్ ఎస్పీ కె. నరసింహ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో పిపిలు, ఎపిపిలు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్స్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో సమీక్ష సమావేశంలో అన్నారు. నేర రహిత సమాజంగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా కోర్టు పోలీస్ సిబ్బంది శ్రమించాలని, న్యాయశాఖా వారి సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు పాటిస్తూ శిక్షల శాతం పెంచాలని అన్నారు. అలాగే నేరస్తులకు శిక్షలు పడుటకు కోర్టు డ్యూటీ పోలీస్ అధికారులు కృషి చేయాలని కోర్టు డ్యూటీ ఆఫీసర్‌లు బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని నేరస్తులు శిక్షల నుండి తప్పించుకోకూడదని అన్నారు. అలాగే కోర్టు, వారెంట్స్, సమన్స్,ఎంసిఎస్ వర్టికల్స్ గురించి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కోర్టు కానిస్టేబుల్ అధికారులు తమ విధిలో భాగంగా ఎప్పటికప్పుడు ఎన్‌బిడబ్ల్యూ (నాన్ బెయిలబుల్ వారెంటులను) క్రమం తప్పకుండా అమలు పరిచి నేరస్తులకు శిక్షలు పడేవిధంగా అమలు పరిచి నేరస్తులకు శిక్షలు పడే విధంగా కృషి చేయాలని, కన్విక్షన్ రేటును పెంచాలని అన్నారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైందని, నేర రహిత సమాజముగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా కోర్టు పోలీస్ సిబ్బంది శ్రమించాలని, ఇందుకోసం ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంత వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కోర్టు కానిస్టేబుల్ ప్రత్యేక శ్రద్ధ, బాధ్యత తీసుకోవాలని సూచించారు. కోర్టులో ఎఫ్ఐఆర్‌లను సరైన సమయంలో అందించాలని, కేసుల్లో ఉన్నటువంటి ప్రాపర్టీని సరైన సమయంలో కోర్టులో డిపాజిట్ చేయాలి. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా నేరస్తులకు శిక్షపడే విధంగా కృషి చేయాలని, నేరస్తులకు వారంట్స్,సమన్స్, సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలని, కోర్టు క్యాలెండర్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, కేసు ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు స్వీకరించాలని, కోర్టు పెండింగ్ ట్రయల్‌కేసులు, వారెంట్స్, సమన్లు, సిసిటిఎన్ఎస్‌లో (కోర్టు మానిటరింగ్ సిస్టం)లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. కోర్టులో ట్రయల్ జరిగిన కేసులు ఎంటర్ చేస్తే పెండింగ్ లేకుండా ఉంటుదని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు మరింత నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్క అధికారి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పిపిలు జనార్ధన్, పరంధాములుగౌడ్, ఎపిపిలు, డీఎస్పీ వెంకటరణరెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్స్, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేసిన కేసీఆర్‌ను ఓడించండి







కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వివరిస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తి టౌన్,జూలై1,ప్రభాతవార్త:**ప్రధానమంత్రి నరేంనరదమోడీ 9 ఏళ్ల సేవా, సుపరిపాలన , పేదల సంక్షేమ పథకాల ప్రచారానికై మహాజన్ సంపర్క్ అభియాన్ పేరిట నిర్వహిస్తున్న ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా వనపర్తి రూరల్ మండలం అచ్యుతాపురం గ్రామంలో బూత్ అధ్యక్షుడు గాంధీ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ పరిధిలోని కుటుంబ సభ్యులను కలిసి సంక్షేమ పథకాల వివరణలతో కూడిన కరపత్రాలను అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వనపర్తి మండల ఇంచార్జి బి.కృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలోని 12 వేలకు పైగా గ్రామ పంచాయతీలలో ప్రధాని నరేంద్రమోడీ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కానీ ఎక్కడ కూడా నరేంద్రమోడీ పేరు , ఫోటో గానీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెట్టడం లేదని మోడీ ఫోటో పెడితే రాష్ట్రంలో కేసీఆర్‌కు ఒక్క ఓటు కూడా రాదనే భయంతోనే కేంద్ర నిధులను రాష్ట్ర నిధులుగా ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. దేశంలోనే వ్యవసాయ అభివృద్ధిలో తెలంగాణ రైతులు ముందంజలో ఉన్నారని ప్రగల్బాలు పలికే కేసీఆర్ రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన ఎరువులను ఉచితంగా పంపిణీ చేస్తానని హామీ ఇచ్చి నాలుగున్నర ఏళ్లయిన ఒక బస్తా కూడా ఉచిత ఎరువులు ఇచ్చిన పాపాన పోలేదని, ఏకకాలంలో లక్ష రుణమాఫీ మరుగున పడిపోయిందని, రుణమాఫీ చేయకపోవడంతో రైతుబంధు డబ్బులను బ్యాంకర్లు వడ్డీల కింద జమ చేసుకుంటున్నారని, రైతుబంధు పేరు మీద యంత్రాల సబ్సిడీ ఎత్తివేశాడని, రుణమాఫీ ఆగిపోవడంతో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ దొరికే అవకాశం లేకుండా పోయిందని కల్లబొల్లి కబుర్లతో రైతాంగాన్ని మోసం చేసిన కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జి పెద్దిరాజు, సీనియర్ నాయకులు పసుపుల సుదర్శన్, బూత్ కమిటీ సభ్యులు గణేష్, తిరుపతయ్య, లక్కీ, శివ, విజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతం..

**- పేపర్ -1కు 85.73, పేపర్ -2కు 85.40 శాతం హాజరు**

**- మహబూబ్‌నగర్ కలెక్టర్ జి రవినాయక్ వెల్లడి**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 1, ప్రభాతవార్త :** జిల్లాలో గ్రూప్ -4 పరీక్షలకు మొత్తం 34459 అభ్యర్థులు పరీక్ష రాసేందుకు 111 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం నిర్వహించిన పేపర్-1కు 29544 మంది అభ్యర్థులు హాజరుకాగా, 4918మంది గైర్హాజరయ్యారని మహబూబ్‌నగర్ కలెక్టర్ జి రవినాయక్ వెల్లడించారు. ఉదయం పరీక్ష పేపర్ -1కు 85.73 శాతం, మధ్యాహ్నం నిర్వహించిన పేపర్ -2కు 29429 మంది అభ్యర్థులు హాజరుకాగా, 5030 మంది గైర్హాజరయ్యారని, 85.40శాతం హాజరుశాతం నమోదైనట్లు తెలిపారు. కలెక్టర్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గాంధీరోడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని అంతా సవ్యంగా జరిగిందన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ సిబ్బంది, ఇతర జిల్లా యంత్రాంగం సహకారంతో పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు సహకరించిన ఎస్పీ కే నరసింహ, అదనపు కలెక్టర్ కే సీతారామావు, లైజన్ అధికారు, జిల్లా చీఫ్ సూపరింటిండెంట్లు, ఇన్విజిలేటర్లు, కలెక్టరేట్ సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జి రవినాయక్

## ప్రశాంతంగా గ్రూప్ 4 పరీక్ష : ఎస్పీ



పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి,జులై 01 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా గ్రూప్ 4 పరీక్ష 28 కేంద్రాలలో ఉదయంసెషన్‌లలో మొత్తం 7325 మంది అభ్యర్థులకు గాను 6356 మంది హాజరయ్యారు. 969మంది గైర్హాజరయ్యారు.మధ్యాహ్నం సెషన్‌కు 7325 మందికి గాను 6350 మంది హాజరు 975 గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్షకు మధ్యాహ్నానికి ఆరుగురు అభ్యర్థులు హజరు కాలేదు. జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ హైస్కూల్, రవితేజ, చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల సోషల్ వెల్ఫేర్ కళాశాల రీపరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పర్యవేక్షిస్తూ పరీక్ష సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్పీ అన్నారు.

## ఆర్టీసీ కార్మికుడిని సన్మానించిన మున్సిపల్ వైస్ చైర్మన్..



ఆర్టీసీ కార్మికుడు బుచ్చన్న గౌడ్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్,జూలై1,ప్రభాతవార్త:** వనపర్తి డిపోలో గత 30 సం.లుగా డ్రైవర్‌గా పని చేస్తు పదవి విమరణ పొందిన బుచ్చన్న గౌడ్‌ను వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఆయన స్వగృహానికి వెళ్లి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థకు ప్రజలకు 30 సం.లుగా సేవలందించిన గౌడ్ చాలా సౌమ్యుడని ప్రయాణికులతో ప్రేమతో మెలిగి అందరి ఆధరాభిమానాలు పొందిన వ్యక్తి అని మున్సిపల్ వైస్ చైర్మన్ కొనియాడారు. బుచ్చన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకుని ఆర్టీసీ కార్మికులు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగస్తులు గోపిగౌడ్, శ్రీనివాసులు, క్రాంతి గౌడ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.